సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం ౹ 6 ౹ నవంబర్ ౹ 2023

స్వేచ్ఛగా ఓటు వేయండి

సిరిసిల్లక్రైం: ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఏఎస్పీ చంద్రయ్య కోరారు. జిల్లా కేంద్రంలో ఆదివారం పోలీసులు, సాయుధ బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సుభాష్‌నగర్, నెహ్రూనగర్, కొత్తబస్టాండ్, గాంధీనగర్, గోపాల్‌నగర్, శివనగర్ ప్రాంతాల్లో కవాతు కొనసాగింది. సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్, ఎస్సై ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

నేడు జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన

- సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేటల్లో సమావేశాలు

సిరిసిల్ల: రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు సిరిసిల్ల తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ టెక్ సెల్‌వింగ్‌ను కేటీఆర్ ప్రారంభిస్తారు. ఉదయం 10.30 గంటలకు బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వారిని కండువాలు కప్పి ఆహ్వానిస్తారు. 11 గంటలకు వేములవాడలో యువజన ఆత్మీయ సమ్మేళనానికి హాజరవుతారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎల్లారెడ్డిపేటలో జరిగే యువ ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగిస్తారని మంత్రి వ్యక్తిగత సహాయకుడు కుంబాల మహేందర్‌రెడ్డి ఆదివారం సాయంత్రం తెలిపారు. ఈమేరకు మంత్రి కేటీఆర్ పాల్గొనే కార్యక్రమాలకు బీఆర్‌ఎస్ వర్గాలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయి.

శ్రీధర్‌కు మల్టీపుల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీధర్

వేములవాడ: వేములవాడకు చెందిన రాపెల్లి శ్రీధర్ మల్టీపుల్ అవార్డు అందుకున్నారు. 2022–23 లయన్ సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్రస్థాయి 320 మల్టీపుల్ అవార్డును లయన్స్ క్లబ్ అప్పటి అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్‌కు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక గ్యాట్ కాంక్లేవ్ సమావేశంలో ఏరియా లీడర్ లయన్ సునీల్‌కుమార్ చేతుల మీదుగా స్వీకరించారు. శ్రీధర్ మాట్లాడుతూ.. గత సంవత్సరంలో అన్ని విధాలుగా సహకరించిన వేములవాడ లయన్స్ క్లబ్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికక్షేత్రంలో లయన్స్‌క్లబ్ రక్తపరీక్షలు



రక్తపరీక్షలు చేస్తున్న వైద్యులు

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత రక్తపరీక్షల శిబిరం నిర్వహించారు. డయాబెటిక్ మాసం సందర్భంగా 230 మందికి ఉచితంగా షుగర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్ నగునూరి, డాక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, నవీన్‌కుమార్ ఉన్నారు.

వైస్ ఎంపీపీ వాహనం తనిఖీ



వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట వైస్ ఎంపీపీ కదిరె భాస్కర్‌గౌడ్ వాహనాన్ని ఆదివారం ఎల్లారెడ్డిపేట పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమలుతో స్థానిక ఠాణా ఎదుట కామారెడ్డి–సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేటకు వస్తున్న వైస్ ఎంపీపీ కదిరె భాస్కర్‌గౌడ్ కారును పోలీసులు ఆపి సోదా చేశారు. ఆ వాహనంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బద్దిపడిగె దేవేందర్‌రెడ్డి ఉన్నారు.

‘ఉద్యమకారులను విస్మరించిన బీఆర్‌ఎస్’

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ ఉద్యమకారులను సీఎం కేసీఆర్ విస్మరించారని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక కో–కన్వీనర్ బుస్స వేణు ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమకారుల పాత్ర కీలకమైందని, అటువంటి ఉద్యమకారులను విస్మరించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ ఉద్యమకారులను గుర్తించాలన్నారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమకారుల జీవనానికి పాలసీ తీసుకురావాలని కోరారు. లేకుంటే ఉద్యమకారుల పక్షాన పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కుసుమ విష్ణు, గుంటుక మహేశ్, గోనె ఎల్లప్ప, రామకృష్ణ పాల్గొన్నారు.

ఓటు సమ్మేళనాలు

- యువకులకు గాలం.. మూకుమ్మడి ప్రచారం
- నేడు వేములవాడ, ఎల్లారెడ్డిపేటల్లో యువసమ్మేళనాలు
- హాజరవుతున్న మంత్రి కేటీఆర్



సిరిసిల్లలో నిర్వహించిన యువసమ్మేళనంలో మంత్రి కేటీఆర్ (ఫైల్)

సిరిసిల్ల: ఎన్నికల ప్రచారం వేగం పుంజుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల దాఖలకు ముందే కాలంతో పోటీ పడుతూ.. ప్రచారం సాగిస్తున్నారు. జిల్లాలో ఇంటింటి ప్రచారాలు సాగుతుండగా.. మరోవైపు పాదయాత్రలు చేస్తున్నారు. అధికార బీఆర్‌ఎస్ మరో అడుగు ముందుకేసి యువ ఆత్మీయ సమ్మేళనాల పేరుతో మూకుమ్మడి ప్రచారానికి తెరలేపింది. ఎన్నికల సమయంలో ప్రభావం చూపే యువకులను కూడగట్టేందుకు అధికార బీఆర్‌ఎస్ యువ సమ్మేళనాలను నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వేములవాడ, ఎల్లారెడ్డిపేటల్లో సోమవారం యువ ఆత్మీయ సమ్మేళనాన్ని బీఆర్‌ఎస్ నిర్వహిస్తుంది. ఈ సభలకు రాష్ట్ర మంత్రి కేటీఆర్, బీఆర్‌ఎస్ స్థానిక నేతలు హాజరవుతున్నారు. యూత్‌లో జోష్ నింపేందుకు ఈ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు.

సిరిసిల్ల సక్సెస్‌తో ముందుకు..

సిరిసిల్లలో గత నెల 27న బీఆర్‌ఎస్ యువ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించింది. ఈ సభకు జిల్లా కేంద్రంలోని 39 వార్డుల యువకులు హాజరయ్యారు. ఐదువేల మందితో ఈ సమ్మేళనం సక్సెస్ కావడంతో ఇదే తరహాలో వేములవాడ, ఎల్లారెడ్డిపేటల్లో నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. వాస్తవానికి అక్టోబరు 27వ తేదీకి ముందు సిరిసిల్ల పట్టణంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తప్ప యూత్ ఎవరూ ప్రచారంలో లేరు. కానీ యువసమ్మేళనం తర్వాత అన్ని వార్డుల్లోనూ యువకుల భాగస్వామ్యం పెరిగింది. దీంతో ప్రచార సరళి జోరందుకుంది. సోషల్ మీడియాలోనూ ఎన్నికల ప్రచారంపై యువకులు ఎక్కువగా ఫోకస్ చేస్తున్నారు. మూకుమ్మడిగా అధికార బీఆర్‌ఎస్‌కు యువకుల మద్దతు పెరిగింది. సిరిసిల్ల యువ సమ్మేళనం సక్సెస్ ఫలితాలతో జిల్లాలో మరో రెండు సభలకు రంగం సిద్ధమైంది. ప్రచార పర్వంలో యువకులను మూకుమ్మడి భాగస్వాములను చేసేందుకు ఈ సమ్మేళనం దోహదపడుతుంది.

యువకుల సమీకరణలో శ్రేణులు

బీఆర్‌ఎస్ నాయకులను యువ సమ్మేళనానికి యువకులను సమీకరించడంలో నిమగ్నమయ్యారు. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారిని ఎక్కువగా యువసమ్మేళనానికి ఆహ్వానించాలని నిర్ణయించారు. ఈమేరకు వేములవాడతోపాటు వేములవాడఅర్బన్, వేములవాడరూరల్, చందుర్తి, కోనరావుపేట మండలాల నుంచి వేములవాడలో జరిగే యువసమ్మేళనానికి యువకులను రప్పించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. మరోవైపు ఎల్లారెడ్డిపేట యువసమ్మేళనానికి ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల యూత్‌ను సమీకరించే పనిలో ఆ పార్టీ ముఖ్యనేతలు నిమగ్నమయ్యారు.

సిరిసిల్లలో పద్మశాలీల సమ్మేళనం

సిరిసిల్లలో పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనాన్ని యువనాయకుడు పత్తిపాక సురేశ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించారు. సిరిసిల్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ సభకు యువకులు ఎక్కువగా రావడం విశేషం. పత్తిపాక సురేశ్ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం సిరిసిల్ల పద్మశాలి సమాజంలో చర్చనీయాంశమైంది. ఎన్నికల వేళ.. ఓటు సమ్మేళనాలు జరుగుతున్నాయి. ముందు ముందు మరిన్ని సమ్మేళనాలు జరిగే అవకాశం ఉంది. ఏది ఏమైనా జిల్లాలో సమ్మేళనాల కాలం సాగుతోంది.

రాబోయే ఐదేళ్లు చాలా కీలకం

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

సిరిసిల్లటౌన్: తెలంగాణ ఆకాంక్షలు తీరుతున్నయ్..కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి ఎన్నికలొచ్చినయి.. రాబోయే ఐదేళ్లు చాలా కీలకం.. ఇప్పుడే ప్రజలు ఆలోచించాలి.. బీఆర్‌ఎస్‌నే గెలిపించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఆదివారం జిల్లా అర్ఎంపీ, పీఎంపీ సభ్యులు, మధ్యాహ్న భోజన కార్మికులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో విద్య, వైద్యం కోసం సీఎం కేసీఆర్ ముందుచూపుతో ఉన్నారని, కాంగ్రెసోళ్లకు ఓట్లేస్తే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిలా అవుతుందన్నారు. జిల్లా ఏర్పడ్డాక మంత్రి కేటీఆర్ చొరవతో ఎంత అభివృద్ధి సాధించిందో చూడాలని కోరారు. 24 గంటలు కరెంటు సరఫరా అవుతున్న రాష్ట్రంగా తెలంగాణ ఉందన్నారు. మధ్యాహ్న భోజనం కార్మికులకు పెండింగ్ డబ్బులు వేశాం, రాని వాళ్లకు రెండురోజుల్లో వస్తాయన్నారు. ఈరోజుల్లోనూ కట్టెలతో వంటలు చేయడం శోచనీయమన్నారు. త్వరలోనే అల్పాహారాలను కూడా మధ్యాహ్న భోజనం వండేవాళ్లకే ఇచ్చే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం జీవో విడుదల చేసి ప్రతి ప్రభుత్వ బడికి సీఎస్‌ఆర్ నిధుల నుంచి సిలిండర్లు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ న్యాలకొండ అరుణ, పార్టీ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

రాజన్నకు కోడెమొక్కులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో కలసి వచ్చిన భక్తులు ధర్మగుండంలో స్నానాలు చేసి తమ ఇలవేల్పు రాజన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఒక్కో భక్తుడి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. భక్తుల రద్దీని అదుపు చేసేందుకు ఆలయ అధికారులు క్యూలైన్లను క్రమబద్ధీకరించారు.

> మీ బానిసత్వాన్ని మీరే పోగొట్టుకోవాలి. అందుకే దేవుడిమీద కానీ.. మహానుభావుల మీదకాని ఆధారపడొద్దు.
> – బీఆర్ అంబేడ్కర్



మీకు తెలుసా?

సహకార నేతకు తప్పని ఓటమి

కరీంనగర్: జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న ముల్కనూర్ కో– ఆపరేటివ్ బ్యాంకు అండ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ వ్యవస్థాపకులైన భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన అల్గిరెడ్డి కాశీవిశ్వనాథ్‌రెడ్డి(హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తండ్రి) హుజూరాబాద్ శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసి రెండుసార్లు ఓటమి పాలయ్యారు. 1972లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల రాజేశ్వర్‌రావు చేతిలో ఓటమి చెందగా, 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి దుగ్గిరాల వెంకట్‌రావు చేతిలో రెండవసారి ఓటమి పాలయ్యారు.

1989 ఎన్నికల్లో స్వతంత్రులదే హవా

కరీంనగర్: శాసనసభ సాధారణ ఎన్నికల్లో 1989లో ఉమ్మడి జిల్లాలో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించి ఔరా అనిపించారు. కరీంనగర్ ఎమ్మెల్యేగా వెలిచాల జగపతిరావు, హుజూరాబాద్ ఎమ్మెల్యేగా కేతిరి సాయిరెడ్డి, బుగ్గారం ఎమ్మెల్యేగా జువ్వాడి రత్నాకర్‌రావు, సిరిసిల్ల ఎమ్మెల్యేగా నీరడి వెంకటకృష్ణయ్యలు గెలుపొందారు. కరీంనగర్, హుజూరాబాద్, బుగ్గారం కాంగ్రెస్ టికెట్ల కోసం పోటీపడి టికెట్ రాకపోవడంతో స్వతంత్ర అభ్యర్థులుగా పై ముగ్గురు పోటీకి దిగి విజయం సాధించారు. సిరిసిల్లలో మాత్రం సీపీఐ(ఎంఎల్) జనశక్తి మద్దతుతో ఎన్వీ కృష్ణయ్య విజయం సాధించి అప్పట్లో సంచలనం సృష్టించారు.

ఆశల పల్లకీలో..

- జీఫామ్ కోసం నేతల ఆరాటం
- మొదలైన నామినేషన్లపర్వం
- 'జీ ఫామ్' స్వయంవరం

సిరిసిల్ల: రాష్ట్ర వ్యాప్తంగా నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. అసెంబ్లీకి సాగుతున్న ఎన్నికల నేపథ్యంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు కొత్త, పాత నేతలు సిద్ధమయ్యారు. గత ఎన్నికల్లో భంగపడ్డ వారు మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ ఆశావహులు నా వైపు ఆశగా చూస్తున్నారు. ఇప్పటికే నన్ను పొందామని కొందరు భావిస్తుండగా.. ఎలాగైనా సాధిస్తామనే ధీమాతో మరికొందరు ఉన్నారు. అభ్యర్థులు ఆశగా నా వైపే చూస్తున్నారు. వాళ్ల చూపులతో నేను ఉక్కిరిబిక్కిరి అవుతున్నాను. అయినా మా అమ్మానాన్నలు(పార్టీ అధినేతలు) నన్ను ఓ అయ్య(అభ్యర్థి) చేతిలో పెట్టి బరువు దించుకోవాలని చూస్తున్నారు. ఇంతకీ నేను ఎవరో చెప్పనే లేదు కదూ... అదేనండి పార్టీ అధిష్టానం అభ్యర్థులకు అందించే బీఫామ్.

నాకోసం పోటాపోటీ

ఎన్నికల సీజన్‌లో నాకు జరిగే పెళ్లిచూపుల్లో ఎందరో యువనేతలు.. మరెందరో తలపండిన నాయకులు.. అంగబలం, అర్థబలంతో దక్కించుకునేందుకు పోటీపడుతున్నారు. బతుకుదెరువు(ఆర్థికంగా) బాగా ఉన్న వారికే కట్టబెట్టాలని నా కన్నవారు ఆలోచిస్తుండ్రు. అందుకే మంచి వరుడిని ఎంచుకోవాలని నాకు కొన్ని ఆశలుంటాయి కదా..! అవన్నీ తీర్చుకోవాలని ఆశపడుతున్నా. మరోవైపు మా అమ్మానాన్నల మాటల్ని కాదనలేను. ఎంతో పలుకుబడి గల వాళ్లు మా ఇంటి(పార్టీ ఆఫీసు) చుట్టూ తిరుగుతుండ్రు. నన్ను ఇస్తే చాలు రాజకుమారుల్లా ఇట్టే ఎత్తుకుపోయి పెళ్లి(నామినేషన్ దాఖలు) చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. కొందరు మా అమ్మానాన్నలను కలిసి వరకట్నం(ఎన్నికల ఖర్చులు) అక్కరలేదు... కన్యాశుల్కంగా(పార్టీఫండ్) ఎదురుకట్నం ఇస్తామంటూ వలవేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకొందరు నా బలగం(సామాజికవర్గం) పెద్దది నాకు కట్టబెడితేనే... నీ కూతురికి రాజయోగం(పదవి) లభిస్తుందని ఆశపెడుతున్నారు. అందరి మాటలూ కోతల్లాగే ఉన్నాయి.

పెళ్లి ముహూర్తం దాటిపోతుందనే..

పెళ్లి ముహూర్తం(నామినేషన్ల ఘట్టం) శుక్రవారం (10వ తేదీ)తో ముగిసిపోతున్న దశలో ఎవరికో ఒక్కరికి కట్టబెట్టేందుకు మావాళ్లు తొందరపడుతున్నారు. ఇప్పటికే నేను దక్కకపోయిన కొందరు పెళ్లికి సిద్ధమైపోయారు. కొందరైతే ఏకంగా పిల్ల(బీఫామ్)ను మాకే ఇయ్యాలని పూలుపండ్లు(ఇడెం) పెట్టి వస్తున్నారు. నన్ను పెళ్లి చేసుకునే వాడు ఎలాంటోడో నాకే తెలియదు. నేను పుట్టింటిని వీడి మెట్టింటికి చేరుతున్న సందర్భంగా ఊరంతా సందడి నెలకొంటుంది. ఇది మీకు(ప్రజలకు) ఇబ్బందిగా అనిపిస్తుంది. కానీ పెళ్లి(ఎన్నికలు) అంటే ఆ మాత్రం హడావుడి తప్పదు కదా. కొంతైనా లొల్లిని తగ్గించేందుకు ఊరి పెద్దలు(ఎన్నికల కమిషన్) కట్టడి చేస్తుంది. కానీ మరో నాలుగు రోజుల్లోనే ఓ శుభముహూర్తాన మీ ముందుకొస్తాను. ఈ ఎన్నికల్లో నన్ను కోరే వారు.. నేను దక్కనని తెలిసి.. ఏకంగా మరో అమ్మాయి(బీఫామ్) కోసం మరో ఇంటి(పార్టీ)కి వెళ్తున్నారు. అక్కడైనా మరో అమ్మాయి (బీఫామ్) దక్కుతుందని ఆశపడుతున్నారు. కానీ నా పెళ్లికి వచ్చే మీరంతా ఎంతో ఆసక్తిగా ఉన్నారని తెలుసు. నేను ఎవరిని వరిస్తానో అని మీరు ఆసక్తిగా చూస్తుంటారు. కానీ మా వాళ్లు మాత్రం నన్ను ఓ అయ్యకిచ్చి పెళ్లి చేయాలని భావిస్తున్నారు. నన్ను వరించే వరుడు(నేత) ఎవరో తొందరలోనే తేలిపోతుంది. ఇంత సేపు ఊహలను.. ఊసులను చదివిన మీ అందరికీ పదివేల వందనాలు... ఇక ఉంటాను..

ఇట్లు
– సదా మీ అందరి క్షేమాన్ని కాంక్షించే..
కొత్త పెళ్లి కూతురు(బీఫామ్)

ప్రభుత్వ మార్కెట్‌లో ప్రైవేటు ధాన్యం




ఇతను పత్తిపాక గంగారెడ్డి. రుద్రంగికి చెందిన గంగారెడ్డి 15 రోజుల క్రితం వరిపంట కోసి.. మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చాడు. ధాన్యం ఆరబెట్టేందుకు స్థలం ఉంటే ఈ పాటికే తేమశాతం వచ్చేదని, స్థలం లేక ఇంకా తేమశాతం రావడం లేదని వాపోతున్నాడు. మార్కెట్‌యార్డులో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు తీస్తే ధాన్యం ఆరబెట్టుకునేందుకు రైతులకు స్థలం దొరుకుతుందని అంటున్నాడు.



ఇతను రుద్రంగికి చెందిన దేశవేని రాజనర్సయ్య. వరి పైరు కోసి ధాన్యం మార్కెట్ యార్డులో పోసేందుకు స్థలం లేకపోవడంతో ఓ మూలన టార్పాలిన్ కవర్ పరచుకొని ధాన్యం పోసుకున్నాడు. రైస్‌మిల్లర్లు నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు తీస్తే తమ ధాన్యం పోసుకునేందుకు వీలుండేదని రాజనర్సయ్య అంటున్నాడు.

- స్థలం కొరతతో రైతన్నల ఇబ్బందులు
- మార్కెట్ సిబ్బంది నిర్లక్ష్యంపై అన్నదాతల ఆగ్రహం
- వెంటనే తొలగించాలని డిమాండ్



ప్రభుత్వ మార్కెట్ యార్డులో నిల్వ చేసిన రైస్‌మిల్లర్ల ధాన్యం బస్తాలు

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ మార్కెట్‌యార్డులో ప్రైవేటు రైస్‌మిల్లర్లు యాసంగి ధాన్యం నిలువ చేయడంతో రైతులకు స్థలం లేక ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. మార్కెట్‌యార్డులో స్థలం కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే మార్కెట్ మొత్తం ధాన్యంతో నిండిపోయి ఆరబెట్టేందుకు స్థలం లేదు. ఇంకా వరి కోతలు పూర్తికాకపోవడంతో మరింత మంది రైతులు ధాన్యం తెస్తే ఎక్కడ ఆరబోసుకోవాలో తెలియడం లేదు.

ఆరు నెలలుగా మార్కెట్‌లోనే..

రైస్‌మిల్లర్లు ఆరు నెలలుగా రుద్రంగి మార్కెట్‌యార్డులో రబీ ధాన్యం నిల్వఉంచారు. మార్కెట్‌యార్డు ఖాళీ ఉన్న సమయంలో ధాన్యం నిల్వ ఉంచితే ఎలాంటి ఇబ్బందులు తలెత్తకున్నా ఇప్పుడు రైతుల వరికోతలు కోసే సమయంలోనైన నిల్వ ఉంచిన ధాన్యం తీస్తే రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదని, తీయకపోవడంతో స్థలం కొరతతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంటున్నారు. రైతులు స్థలం కొరతతో ఇబ్బందులు పడుతున్నా మార్కెట్ సిబ్బంది ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ధాన్యం బస్తాలు తొలగించి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతున్నారు.

ధాన్యం బస్తాలపై టార్పాలిన్ కవర్లు

రైతన్నల ధాన్యం వర్షాలకు తడవకుండా ఉండేందుకు టార్పాలిన్ కవర్లు అడిగితే సిబ్బంది ఇవ్వడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల కోసం ఉన్న టార్పాలిన్ కవర్లను తమకు ఇవ్వడానికి కొర్రీలు పెట్టి రైస్‌మిల్లర్లకు ఇచ్చి పాడు చేయడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన మార్కెట్‌యార్డును, టార్పాలిన్ కవర్లను ఇతరులు వినియోగించుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ధాన్యం బస్తాలను తొలగిస్తాం

రబీలో కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను రైస్‌మిల్లర్లు దించుకునేందుకు కోతలు విధించడంతో ఇక్కడే నిల్వ ఉంచాం. రైస్‌మిల్లర్‌కు చెప్పి వెంటనే ధాన్యం బస్తాలు తీసి వేయిస్తాం.

– ఏనుగుల శ్రీనివాస్,
మార్కెట్ కమిటీ చైర్మన్, రుద్రంగి

అన్ని రంగాల్లో బీసీలకు వాటా దక్కాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు



మాట్లాడుతున్న పర్శ హన్మాండ్లు

సిరిసిల్ల: విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, వ్యాపార రంగాల్లో బీసీలకు వాటా దక్కాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో ఆదివారం నిర్వహించిన బీసీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు సముచిత స్థానం ఇచ్చే పార్టీలను, నాయకులను ఆదరిస్తామన్నారు.

బీసీ సంఘం నియామకం

సిరిసిల్లలో బీసీ సంఘాన్ని కొత్తగా నియమించినట్లు పర్శ హన్మాండ్లు తెలిపారు. సిరిసిల్ల పట్టణ ఉపాధ్యక్షుడిగా కోడం రవీందర్, పట్టణ మీడియా ఇన్‌చార్జిగా కొండా విజయ్‌కుమార్, ఎల్లారెడ్డిపేట పట్టణ ప్రధాన కార్యదర్శిగా దీటి బాలయ్య, ఎల్లారెడ్డిపేట మండల ప్రధాన కార్యదర్శిగా పి.తిరుపతిగౌడ్, బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శిగా బి.సంతోష్‌గౌడ్, సిరిసిల్ల పట్టణ 32వ వార్డు అధ్యక్షుడిగా సామల తిరుపతిని నియమించారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు కంచర్ల రాజు, తడక కమలాకర్, సామల తిరుపతి, దాసరి సురేష్, చిందం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్ ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన జిల్లెల్ల రాజయ్య ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకోగా.. ఎస్సై మహేశ్ ఆదివారం సెల్‌ఫోన్‌ను అందించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రాజయ్య సెల్‌ఫోన్‌ను పట్టుకుని బాధితుడికి అందజేశారు.


కరీంనగర్ మున్సిపల్ ఆర్ఐ మృతి



సత్యనారాయణ (ఫైల్)

సిరిసిల్లటౌన్: అనారోగ్యంతో మున్సిపల్ ఆర్ఐ మృతిచెందాడు. సిరిసిల్ల పట్టణం పోచమ్మ వీధికి చెందిన కూర సత్యనారాయణ(56) కరీంనగర్ నగరపాలక సంస్థలో ఆర్ఐగా పని చేస్తున్నారు. కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆయనకు భార్య అరుణ, కొడుకులు అభిషేక్, రిషికేష్ ఉన్నారు. అంతకుముందు సిరిసిల్లలో పని చేసిన సత్యనారాయణ మృతిపై ఆయన సహోద్యోగులు, సిరిసిల్ల ప్రముఖులుసంతాపం వ్యక్తం చేశారు.

విద్యుత్ స్టార్టర్, మోటార్ అపహరణ



స్టార్టర్‌ను ధ్వంసం చేసిన దొంగలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పోచమ్మ దేవాలయం వద్ద దుబ్బ ఎల్లారెడ్డి అనే రైతుకు చెందిన వ్యవసాయ పొలంలో గుర్తుతెలియని దొంగలు విద్యుత్ మోటారు, స్టార్టర్‌ను ఆదివారం ఎత్తుకెళ్లారు. బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ నడిబొడ్డున ఉన్న పొలం వద్ద దొంగలు స్టార్టరును ధ్వంసం చేసి దొంగతనానికి పాల్పడడం కలకలం రేపింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

వేములవాడఅర్బన్: అనుపురం గ్రామ శివారులోని వేములవాడ–కరీంనగర్ ప్రధాన రహదారిలో కారు, ద్విచక్ర వాహనం ఢీకొని రుద్రవరం గ్రామానికి చెందిన కూస రాకేశ్, బొమ్మ భారత్, సాత్వికకు తీవ్ర గాయాలయ్యాయి. వీరు ముగ్గురు ద్విచక్ర వాహనంపై వస్తుండగా కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. స్థానికులు వీరిని వేములవాడ పట్టణంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు.

విప్లవవీరుల పెద్దపల్లి

- ఎన్నికలపై నక్సల్స్ ప్రభావం
- తొలి ఎమ్మెల్యే పీడీఎఫ్ అభ్యర్థి
- శ్రీరాంసాగర్ జలాలతో 'వరి' సిరులు
- ఎస్సారెస్పీ కాలువపై జల విద్యుత్ కేంద్రాలు
- పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ముఖచిత్రం



పెద్దపల్లిరూరల్: విప్లవవీరులను అందించిన పెద్దపల్లికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. వామపక్ష ఉద్యమానికి ఊపిరులూదిన మల్లోజుల సోదరులు కిషన్‌జీ ఉరఫ్ మల్లోజుల కోటేశ్వర్‌రావు, మల్లోజుల వేణుగోపాల్‌రావు పెద్దపల్లి బిడ్డలే. వీరేకాకుండా అనేక మంది అగ్రనేతలుగా ఎదిగారు.

పెత్తందారీ వ్యవస్థపై పోరు

- అప్పటి పీపుల్స్‌వార్(ప్రస్తుత మావోయిస్టు) పార్టీ పెద్దపల్లి నియోజకవర్గంలో అధిక ప్రభావం చూపేది.
- ఈక్రమంలోనే పెత్తందారీ, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు సాగించింది.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తొలిసారి పెద్దపల్లిలో డీఎస్పీ స్థాయి అధికారి బుచ్చిరెడ్డిని అప్పటి పీపుల్స్‌వార్ నక్సల్స్ హతమార్చడం సంచలనం సృష్టించింది.
- పెద్దపల్లి అసెంబ్లీ స్థానానికి 1952లో జరిగిన తొలిఎన్నికల్లో ఎల్.ముత్తయ్య పీడీఎఫ్ నుంచి పోటీచేసి విజయం సాధించారు.

తొలి ఎన్నికలు 1952లో..

1952లో అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. ఇప్పటి వరకు 15సార్లు ఎన్నికలు నిర్వహించారు. నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయాధారితం. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా అందే సాగునీటితో వరి సిరులు కురిపిస్తోంది. ఎస్సారెస్పీ డీ–83 ప్రధానకాలువ పెద్దపల్లి నుంచి మంథనికి, డీ– 86 ద్వారా సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లోని దాదాపు 2లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. అంతేకాదు.. కాలువలపై ఆరు చోట్ల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి.

వందేళ్ల క్రితమే రైల్వేస్టేషన్..

- పెద్దపల్లిలో వందేళ్ల క్రితమే రైల్వేస్టేషన్ అందుబాటులోకి వచ్చింది.
- ఈప్రాంత రైతులు అత్యధికంగా వేరుశనగ, కంది సాగుచేసేవారు. వరంగల్ తర్వాతి స్థానంలో అతిపెద్ద మార్కెట్‌గా పెద్దపల్లికి ఇప్పటికీ గుర్తింపు ఉంది.

ఓటర్ల తీర్పు విలక్షణం..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు పెద్దపల్లి ఓటర్లు విలక్షణమైన తీర్పునిచ్చేవారు. వరుసగా రెండోసారి ఎవరినీ ఎన్నుకునేవారు కాదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో టీఆర్‌ఎస్ నుంచి దాసరి మనోహర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. 2018లోనూ ఆయనే విజయం సాధించి గతరికార్డులను బద్దలు కొట్టారు. మూడోసారి తన అదృష్టం పరీక్షించుకునేందుకు బరిలో నిలిచారు.

'గోనె' ప్రత్యేక ముద్ర

1983లో జరిగిన పెద్దపల్లి అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ మిత్రపక్షమైన సంజయ్ విచార్ మంచ్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆరుమాసాలకే తన పదవికి రాజీనామా చేసిన గోనె ప్రకాశరావు.. రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. అప్పటినుంచి నేరుగా ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయలేదు. అయితే దివంగత సీఎం వైఎస్సార్ ఆయనను ఆర్టీసీ చైర్మన్‌గా నియమించారు.

1952 నుంచి 2018 వరకు ఎమ్మెల్యేలు

సంవత్సరం	అభ్యర్థి	పార్టీ
1952	ఎల్.ముత్తయ్య	పీడీఎఫ్
1962	బుట్టి రాజారాం	కాంగ్రెస్
1967	జిన్న మల్లారెడ్డి	స్వతంత్ర
1972	జిన్న మల్లారెడ్డి	కాంగ్రెస్
1978	గొట్టిముక్కుల రాజిరెడ్డి	కాంగ్రెస్
1983	గోనె ప్రకాశ్‌రావు	సంజయ్ విచార్‌మంచ్
1983	గీట్ల ముకుందరెడ్డి	కాంగ్రెస్
1985	కాల్వ రామచంద్రారెడ్డి	టీడీపీ
1989	గీట్ల ముకుందరెడ్డి	కాంగ్రెస్
1994	బిరుదు రాజమల్లు	టీడీపీ
1999	గుజ్జుల రామకృష్ణారెడ్డి	బీజేపీ
2004	గీట్ల ముకుందరెడ్డి	బీఆర్ఎస్
2009	విజయరమణారావు	టీడీపీ
2014	దాసరి మనోహర్‌రెడ్డి	బీఆర్ఎస్
2018	దాసరి మనోహర్‌రెడ్డి	బీఆర్ఎస్

కాంగ్రెస్ అభ్యర్థిగా 'గీట్ల'

పెద్దపల్లి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన గీట్ల ముకుందరెడ్డి తొలుత సంజయ్ విచార్ మంచ్ అభ్యర్థి గోనె ప్రకాశ్‌రావు చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత అనూహ్యంగా గోనె ప్రకాశ్‌రావు తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో వచ్చిన ఉప ఎన్నికల్లో సమీప టీడీపీ అభ్యర్థి వేముల రమణయ్యపై గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీపడ్డారు. 2004 ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌లో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి విజయరమణారావు చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశించిన గీట్ల ముకుందరెడ్డిని కాదని భానుప్రసాదరావుకు పార్టీ అధిష్టానం టికెట్ ఇవ్వడంతో మనస్తాపానికి గురయ్యారు.

బాబ్బాబు.. జర నా మాట విను!

నేతలు దిగివచ్చిన వేళ.. ఎన్నికల సిత్రాలు



కోరుట్ల: ఏమైందిరా రాజు.. ఎన్నడు లేంది ఇయ్యాల మన చిన్న లీడరు ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది. ఎక్కడున్నడో ఎమో.. గీ ఎలచ్చన్ల ఏమన్న ఎంజాయ్ చేద్దామంటే దొరుకుతలేదేందిరా.. అంటూ తన దోస్తుని పలకరించిండు శ్రీను. గీ పలకరింపుతో ఇద్దరు జర దూరంగా పోయి గుసగుస మొదలెట్టిండ్రు. గ ముచ్చట సంగతేంటో తెలుసుకుందాం.

రాజు : ఏమైందిరా శీను ఒక్కసారిగా గా మందిలకెల్లి నన్ను మూలకు పట్టుకొచ్చి ముచ్చట మొదలెట్టిన్..?

శ్రీను : అరె రాజు గీ ముచ్చట అందరిలో చెప్పేది కాదురా. వారం నుంచి మనూరి చిన్న లీడరు ఫోన్ కలుస్తలేదు. నేను కూడా మస్తుసార్ల కొట్టిన. ఎందుకు కలుస్త లేదో తెలుసా..?

రాజు : ఎందుకు ఫోన్ కలుస్తులేదని నిన్ను అడిగితి. మళ్లీ నాకెట్లా తెలుస్తది నువ్వే చెప్పు ఎం కథనో..?

శ్రీను : ఇగో ఎవల్లతోని అనకు గానీ మన చిన్న లీడరు పార్టీ మారుదమని చూస్తున్నడు. ఇది తెలిసి ఇప్పుడున్న పార్టీ మనుషులు గీ ఎలచ్చన్ల టైమ్‌లో ఎట్ల మారుతవ్ అని మస్తు ఒత్తిడి తెస్తుండ్రు. గందుకే మనోడు సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ పెట్టి చుట్టాలింటికి పోయిండు.

రాజు : గట్లనా ఇప్పుడున్న పార్టీకి ఏమైందిరా, ఎందుకు మారుతడట. గీ ముచ్చట నాకు ఎప్పుడు ఇనవడలే..?

శ్రీను : ఏడాది నుంచి మన చిన్న లీడరు వాళ్ల పార్టీ పెద్ద సారును ఓ పని అడిగితే గాయిన నానబెట్టుకుంట వచ్చిండట. మందికి ఏం చేసినా చేయకపోయినా సరే కానీ నేను చెప్పిన పని కాకపోయే అని అలిగి ఫోన్ స్విచ్ ఆఫ్ పెట్టి వేరే పార్టోళ్ల తోటి మంతనాలు మొదలెట్టిండని తెలిసింది.

రాజు: అవునా మరి నాకైతే ఏం తెల్వలే. మొన్న మన చిన్న లీడరు పార్టీ పెద్ద సారు మన ఊరికి వచ్చిండు గానీ ఆయన ప్రచారం కోసం వచ్చిండని అనుకున్నా.

శ్రీను : ప్రచారం లేదు ఏం లేదు. మన చిన్న లీడరు పార్టీ ఎక్కడ ఇడిసిపెడతడోనని వాళ్ల పార్టీ పెద్దసారు గడిబిడ అయిండు. మన చిన్న లీడరుకు ఫోన్ చేస్తే కలవ్వలేదు. డొటచ్చి పెద్ద లీడరు సీదా మనోని ఇంటికి వెళ్లిండు. గప్పుడు మనోడు గా ముచ్చట..గీ ముచ్చట చెప్పి మూడు గంటలు బతిమాలిచ్చుకున్నడు. చివరికి ఇద్దరు కలిసి పళ్లికిలిచ్చుకుంట ఓ ఫొటో దిగిండ్రు. గప్పుడు పెద్ద లీడరు మనసు తిరమైంది.

రాజు : గీ ముచ్చటంత నాకు తెల్వకపోయే. పార్టీ పెద్ద సారు వచ్చి మూడు రోజులాయే, మరి ఇంకా మన చిన్న లీడరు ఫోన్ కలుస్తలేదు కదా..?

శ్రీను: ఇగో..గీడ మరో తిరకాసు జరిగింది. చిన్న లీడరు పార్టీకి చెందిన పెద్ద లీడరు వచ్చి మాట్లాడి పోయిండో లేదో గీ ముచ్చట తెలిసి ఎక్స్‌పార్టీ లీడరు వెంటనే మనోని ఇంటికి వచ్చిండు. ఆగో మాతోని వస్తనని అంటివి కదా..మా పార్టీలోకి రా..అనంగనే మనోడు మళ్లీ బతిమాలించుకుని ఎక్స్‌పార్టీ లీడరుతో పళ్లికిలిచ్చుకుంట ఫొటోలు దిగిండు. ఇగ ఆ తర్వాత గీ తలనొప్పి ఎందనుకుని ఫోన్ స్విచ్చ్‌ఆఫ్ చేసిండు. ఎట్లయితే ఏందిరా..ఎన్నడు రాని పెద్ద లీడర్లను మనోడు ఇంటికి రప్పించుకున్నడు, బతిమాలించుకున్నడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

గొల్లపల్లి: మండలంలోని చెందోలి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఆత్రం సాయికుమార్ (24) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ధర్మారానికి చెందిన సాయికుమార్ వరుసకు తమ్ముడైన శడమాకి నాగబాబుతో కలిసి జగిత్యాలలో పనినిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో చందోలి శివారులో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ ఎగిరి కిందపడ్డారు. ఈ క్రమంలో సాయికుమార్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. నాగబాబు పరిస్థితి విషమంగా ఉండటంతో జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నాడు. సాయికుమార్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుక్కి దున్నకుండానే మొక్కజొన్న సాగు



జగిత్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్‌లో వరి సాగు చేసిన పొలాల్లో దుక్కి దున్నకుండా యాసంగి పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఈ పద్ధతిలో సాగు చేసేందుకు రైతులను మండల వ్యవసాయాధికారులు ప్రోత్సహిస్తున్నారు. యాసంగి సీజన్‌లో జిల్లాలోని రాయికల్, మేడిపల్లి, సారంగాపూర్ మండలాల్లో అత్యధికంగా ఈ పద్ధతిలో సాగు చేస్తుంటారు. దీంతో రైతులకు దుక్కి దున్నే ఖర్చు తగ్గడంతో పాటు పంటమార్పిడి వల్ల తెగుళ్ల బెడద తగ్గుతుందని జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్ పేర్కొన్నారు.

సౌర యూనిట్లపై అనాసక్తి

- ఇళ్లపై ఏర్పాటుకు ముందుకు రాని మహిళలు
- పైలట్ జీపీలుగా గంభీరావుపేట, మోహినికుంట
- జిల్లాలో యూనిట్ల ఏర్పాటు శూన్యం



అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

గంభీరావుపేట(సిరిసిల్ల): విద్యుత్ బిల్లులు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సబ్సిడీపై సౌర యూనిట్లు మంజూరు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కానీ ఆదిలోనే అనేక అవాంతరాలతో కార్యక్రమ లక్ష్యం నీరుగారిపోతోంది. పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడం, సబ్సిడీ సౌర యూనిట్లు పొందడానికి స్వయం సహాయక సంఘాల మహిళలు ముందుకు రాకపోవడం వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలు మినహాయిస్తే ఇప్పటికి ఒక్క ఇంటిపై కూడా సోలార్ ఫలకలు ఏర్పాటు చేయలేకపోయారు. దానికి కారణం మహిళలు దీనిపై అనాసక్తి చూపడమేనని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు సౌర యూనిట్లు ఇవ్వడానికి అధికారులు సిద్ధంగా ఉన్నా.. మహిళలు అంతగా ఆసక్తి చూపడం లేదు. టీఎస్ రెడ్‌కో, స్త్రీనిధి విభాగాల సమన్వయంతో అవగాహన సదస్సులు నిర్వహించినా.. జిల్లాలో మాత్రం సౌర ఫలకల ఏర్పాటు మొదలు కాలేదు. జిల్లాలో పైలట్ గ్రామ పంచాయతీలుగా గంభీరావుపేట, ముస్తాబాద్ మండలం మోహినికుంటను ఎంపిక చేశారు. మహిళలు మందుకు రాని కారణంగా ఆయా గ్రామాల్లోనూ సౌర యూనిట్ల ఏర్పాటు ముందుకు సాగడం లేదు.



సిరిసిల్లలో సఖి కార్యాలయంపై సౌర పలకలు

ప్రభుత్వ కార్యాలయాలపై ఏర్పాటు

మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 9 ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వాసుపత్రి, సఖి కేంద్రాలపై సౌర ఫలకలు ఏర్పాటు చేశారు. నర్సింగ్ కళాశాలపై ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపినట్లు రెడ్‌కో ఏడీవో లక్ష్మీకాంత్ తెలిపారు.

కారణాలివే..

- స్వయం సహాయక సంఘాల మహిళలు ఇప్పటికే స్త్రీనిధి ద్వారా వివిధ రకాల రుణాలు పొందారు. తిరిగి సౌర యూనిట్ల కోసం రుణం పొందితే.. నెలనెలా కిస్తీ చెల్లించాలంటే వారికి ఆర్థికంగా భారం కానుంది. అందుకే మహిళలు వెనకడుగు వేస్తున్నారు.
- సౌర యూనిట్ విలువ రూ.1.44లక్షలుండగా.. సబ్సిడీలు పోనూ మహిళలు 60 నెలల్లో రూ.1.16లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అందుకు ప్రతి నెల రూ.1,800 ఈఎంఐ చెల్లించాల్సి ఉంటుంది. కాగా ప్రస్తుతం ఇంటి కరెంటు బిల్లు నెలకు రూ.1,800 కంటే తక్కువగానే వస్తుంది. అలాంటప్పుడు యూనిట్ ఈఎంఐ రూ.1,800 చెల్లించడం ఎందుకని మహిళలు పెదవి విరుస్తున్నారు.
- సిరిసిల్లలో సెస్ సంస్థ ఉండడంతో సౌర యూనిట్లు బిగించడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

రోజుకు రూపాయే!

- ఓటును అమ్మేస్తే వచ్చే ఫలితమిదే..

పెగడపల్లి(ధర్మపురి): ఓటు వజ్రాయుధంలాంటిదని చెప్పవచ్చు. ఒక్క ఓటుతో అభ్యర్థుల తలరాతలు మార్చవచ్చు. అలాంటి ఓటును అమ్ముకుంటే రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించినవారవుతారు. ఐదేళ్లు ప్రశ్నించే హక్కును కోల్పోయినట్లే. అదేలాగంటే.. ఎన్నికలు సమీపించే కొద్ది కొందరు అభ్యర్థులు ప్రచార శైలిని మార్చేస్తారు. ఓటర్లకు డబ్బు ఎర చేస్తారు. ఒక్కో ఓటుకు రూ.2 వేల నుంచి రూ.5 వేల ఇచ్చేందుకు తెగిస్తారు. ఓటర్లతో ప్రమాణాలు చేయించుకుంటారు. ఈ మానసిక బలహీనతను వారు గుప్పిటపడతారు. రోజుకు కేవలం ఒక్క రూపాయితోనే మున్ముందు ప్రశ్నించే హక్కును కాల రాసేస్తారు. ఉదాహరణకు ఒక్క ఓటును రూ.2 వేలకు అమ్ముకున్నారనుకోండి. రాబోయే ఐదేళ్లు అంటే 1,825 రోజులకు గానూ రోజుకు ఇచ్చే డబ్బు ఎంతో తెలుసా..అక్షరాల రూపాయే (రూ.1.09). మీరే లెక్కేసుకోండి. రోజువారీ కూలీ వేతనంతో ఇది ఎన్నోవంతో మీకే తెలిసిపోతుంది. కార్మికులు, కూలీలకు కనీసం రోజు కూలీ కూడా పడదు. అదే ఆ రూపాయి అతడి వద్ద తీసుకోకుండా ఉంటే అదే ప్రజాప్రతినిధి వద్దకు ధైర్యంగా వెళ్లవచ్చు. మీరు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని కోరవచ్చు. అదే డబ్బులు తీసుకుంటే.. అతడి కాళ్ల కింద ఓటు హక్కును పడేసినట్లే. కనీసం వారి ముందు నిలబడే అర్హత లేనట్లే.

గల్ఫ్ నుంచి స్వగ్రామానికి మృతదేహం

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన కొల్లూరి రమేశ్ (38) గల్ఫ్‌లో మృతిచెందగా ఆదివారం మృతదేహం ఇంటికి చేరింది. గ్రామస్తుల వివరాలు.. రమేశ్ ఉపాధి నిమిత్తం 17 నెలల క్రితం బెహరాన్ వెళ్లాడు. ఇటీవల సాయంత్రం పూట రోడ్డుపై నడుస్తుండగా అకస్మాత్తుగా కిందపడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. అతడి మిత్రులు వెంటనే సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి అంత్యక్రియలు పూర్తి చేశారు.

బియ్యం పట్టివేత

కరీంనగర్‌క్రైం: రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు ఆదివారం సాయంత్రం అరెస్టు చేశారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ ఆటోనగర్‌కు చెందిన టి.మల్లేశం తన వాహనంలో 3.3 క్వింటాళ్ల బియ్యం తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్‌చేసి అతడిపై కేసు నమోదు చేశారు. అతడు తక్కువ రేట్‌కు కొనుగోలు చేసి ఎక్కువ రేట్‌కు అమ్ముతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



రేణుశ్రీని అభినందిస్తున్న హెచ్‌ఎం విమల

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని రేణుశ్రీ ఉమ్మడి జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ వెంకటలక్ష్మి తెలిపారు. అండర్– 14 ఖోఖో విభాగంలో, 600 మీటర్ల పరుగు పందెంలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఆదివారం ప్రధానోపాధ్యాయురాలు విమల, సర్పంచ్ మహేశ్వర్‌రావు, ఎంపీటీసీ పరశురాం అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో బీట్ ఆఫీసర్‌కు తీవ్ర గాయాలు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని ఇప్పపెల్లి శివారులో ఆదివారం రాత్రి టాటా ఏస్ వాహనం బైక్‌ను ఢీకొట్టగా అటవీశాఖ బీట్ ఆఫీసర్ కారం శ్రీనివాస్‌కు తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. శ్రీనివాస్ పోతారం బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో ఇప్పపెల్లి శివారులో ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. శ్రీనివాస్‌కు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నాటుసారా స్థావరంపై దాడి



బెల్లంపానకం పారబోస్తున్న పోలీసులు

మల్యాల (చొప్పదండి): మండలంలోని రాజారం గ్రామ శివారులో నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు ఆదివారం ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో నాటుసారా స్థావరంపై పోలీసులు దాడి చేశారు. 5 లీటర్ల సారా, 200 లీటర్ల బెల్లంపానకం పారబోశారు. తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేస్తున్న శివరాత్రి మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గం

కోరుట్ల: పట్టణంలోని సి.ప్రభాకర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం జన విజ్ఞాన వేదిక జిల్లా నూతన కార్యవర్గాన్ని జాతీయ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎనుగంటి రాజేశం, ప్రధాన కార్యదర్శిగా రాపల్లి రాజగంగారాం, ఉపాధ్యక్షులుగా తాండూరు శ్రీనివాస్, నేతూరి ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడిగా చెన్నా విశ్వనాథంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.